పన్ను కట్టు.. బండి పట్టు

పన్ను ఎగవేతదారులపై ఆర్టీఏ కొరడా

రవాణా ఖజానాకు చిల్లు పెడుతున్న ఉల్లంఘనులు

- రోడ్లపైకి యథేచ్ఛగా ట్యాక్స్ చెల్లించని రాష్ట్ర, అంతర్రాష్ట్రాల వాహనాలు
- రూ.కోట్ల నష్టం.. గతంలో ఆర్టీఏ అధికారుల తనిఖీల్లో 14 లగ్జరీ కార్లు సీజ్
- హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే అధికం
- నేటి నుంచి ప్రత్యేక బృందాలతో తనిఖీలు

సిటీబ్యూరో, జూన్ 19(నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్రంలో తిరుగుతున్న ఇతర రాష్ట్రాల వాహనాలపై ఆర్టీఏ అధికారులు దృష్టి సారించారు. వాహన పన్నులు ఎగవేసి ఇష్టానుసారంగా ఇక్కడ తిష్టవేసిన వాహనాలు వేలల్లో ఉన్నాయనే ఫిర్యాదులు అందడంతో రవాణా శాఖ ప్రత్యేక తనిఖీలకు సిద్ధమైంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఇతర రాష్ట్రాల వాహనాలు అత్యధికంగా తిరుగుతున్నాయి. ఇటీవల వాహనాల తనిఖీల్లో 150కి పైగా వాహనాలు ఆర్టీఏ అధికారులకు పట్టుబడ్డాయి. దీంతో ప్రత్యేక డ్రైవ్ చేయాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లతో బృందాలను ఏర్పాటు చేశారు. నగరంలోని

పన్ను ఇలా..!

వాహన గడువు	రూ.5లక్షల లోపు	రూ.5-10 లక్షలు	రూ.10-20 లక్షలు	రూ.20 లక్షలపైన..
కొత్త వాహనం	13 శాతం	14	17	18
2 ఏండ్ల లోపు	12	13	16	17
2-3 ఏండ్ల లోపు	11.5	12.5	15.5	16.5
3-4 ఏండ్లు	11	12	15	16
4-5 ఏండ్ల లోపు	10.5	11.5	14.5	15.5

నిబంధనలు ఇవి.!

చాలా వరకు ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలను నగరంలో తిప్పుతున్నారు. సాధారణంగా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల మధ్య విలువ జేసే ఫోర్ వీలర్ వాహనం అయితే దాని ఖరీదుపై 14 శాతం లైఫ్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అదే ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ పూర్తయి ట్యాక్స్ చెల్లించి.. రెండేండ్లు గడిస్తే.. ఆ వాహనం తెలంగాణలో నడపాలంటే కచ్చితంగా ఇక్కడి నిబంధనల ప్రకారం ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఆ రెండేండ్ల పన్నును మినహాయించి మిగతా పన్నును వసూలు చేస్తారు. సదరు యజమాని అక్కడ చెల్లించిన సొమ్మును అక్కడి ఆర్టీఏకు దరఖాస్తు పెట్టుకుని తిరిగి తన ఖాతాలో జమ చేసుకోవచ్చు. ఉదాహరణకు ముంబైలో రూ.9కోట్ల విలువజేసే కారును కొనుగోలు చేస్తే.. ఆ వాహనాన్ని తెలంగాణలో నడపాలనుకుంటే 14 శాతం ట్యాక్స్ అనగా, సుమారు రూ.కోటి 26 లక్షలు పన్ను చెల్లించాలి. ఒకవేళ చెల్లించకుండా కాలయాపన చేస్తే ఇన్‌వాయిస్ ఆధారంగా మళ్లీ లైఫ్ టాక్స్‌పై నెలకు 1 లేదా 2 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. వాహన యజమాని నేరుగా పన్ను చెల్లిస్తే కారు ఖరీదు ఆధారంగా 1 శాతం పెనాల్టీ/అధికారుల తనిఖీల్లో పట్టుబడితే చెక్ రిపోర్ట్ ఆధారంగా 2 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. అలా చెల్లించిన అనంతరం జరిగే ప్రక్రియతో ఇక్కడి నంబర్‌ప్లేట్ జారీ అవుతుంది. నిర్లక్ష్యం చేస్తే ఆర్టీఏ అధికారులు వాహనాలను సీజ్ చేస్తారు. అంతేకాదు అనుమతి లేకుండా వాహనాలను నడిపి ఏదైనా రోడ్డు ప్రమాదానికి కారణమైతే అలాంటి ఘటనల్లో మరింత కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు.

కొన్ని కంపెనీల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వాళ్లు కీలకంగా ఉండటంతో వాళ్లంతా తమ రాష్ట్రాలకు చెందిన వాహనాలను ఇక్కడ పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై తెలంగాణ ఫోర్ వీలర్ అసోసియేషన్ రవాణా శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేసింది. అలాంటి వాహనాల రాకపోకలతో తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్

ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాం. నేటి నుంచి ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపడుతున్నాం. పన్ను ఎగవేసి నిబంధనలు అతిక్రమించిన వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తాం. వాహనాలు సీజ్ చేస్తాం. ఆర్టీఏ నిబంధనలు అందరూ పాటించాలి. నగర రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా ఇతర రాష్ట్రాల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు నిర్వహిస్తున్నాం.

– సి.రమేశ్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్

21న కలెక్టరేట్‌లో జాబ్ మేళా

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 19: మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఈనెల 21వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.వై.నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 2 గంటల వరకు నిర్వహించే జాబ్‌మేళాలో www.nic.gov.in లో రిజిస్టర్ చేసుకొని హాజరుకావాలని, 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివిన అభ్యర్థులు అర్హులని, ఇతర వివరాలకు 73868 09422 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'లా' పూర్తయిన వారికి ఉచిత శిక్షణ

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): 'లా' పూర్తి చేసిన అభ్యర్థులకు మూడేండ్ల ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు హైదరాబాద్ బీసీ అభివృద్ధి శాఖ అధికారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్‌చే గుర్తించబడిన విద్యా సంస్థ నుంచి 'లా' కోర్సు ఉత్తీర్ణత కలిగి, బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకొని ఉండాలని సూచించారు. ఆసక్తి గల వారు లక్డీకపూల్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని కోరారు.

నేషనల్ స్పేస్ సొసైటీ డిబేట్‌లో శ్రీచైతన్య విద్యార్థులు

సిటీబ్యూరో, జూన్ 19(నమస్తే తెలంగాణ): అమెరికాకు చెందిన నేషనల్ స్పేస్ సొసైటీ ఏటా స్పన్(SPUN) పేరిట నిర్వహించే అంతర్జాతీయ డిబేట్ పోటీల్లో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ప్రపంచ వ్యాప్తంగా 9 దేశాల నుంచి 100 మందికిపైగా విద్యార్థులు పాల్గొంటే... నలుగురు విద్యార్థులను ఫైనల్‌కు క్వాలిఫై చేసి ఇద్దరినీ విజేతలుగా ప్రకటించే ఈ పోటీల్లో శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన ఓ విద్యార్థిని విజేతగా నిలిచింది. దేశం నుంచి ఫైనల్‌కు చేరుకున్న వారిలో శ్రీచైతన్య విద్యార్థే ఉన్నారు. కాగా, ఈ పోటీల్లో ఇప్పటివరకు నాలుగు సార్లు విజయం సాధించగా.. రెండు సార్లు విన్నర్‌గా, రెండు సార్లు రన్నరప్‌గా నిలిచినట్లు శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యం తెలిపింది. ఈ పోటీలను గత ఏడేండ్లుగా నిర్వహిస్తుండగా.. శ్రీచైతన్య స్కూల్ నాలుగు సార్లు సత్తా చాటి సరికొత్త రికార్డును నెలకొల్పినట్లుగా శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది.

పీజీయన్ నుంచి వినూత్న ప్రైజర్ కుక్కర్

సిటీబ్యూరో, జూన్ 19(నమస్తే తెలంగాణ) : ప్రముఖ కిచెన్ ఆప్లయన్స్ ఉత్పత్తి సంస్థ పీజీయన్ బ్రాండ్ స్టాప్‌క్రాఫ్ట్ పేరిట ఎలక్ట్రా – ఎలక్ట్రిక్ ప్రైజర్ కుక్కర్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చింది. బుధవారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో ఎలక్ట్రా కుక్కర్‌ను ఆవిష్కరించారు. కిచెన్ ఆప్లయన్స్ తయారీల్లో ఎలక్ట్రా విప్లవాత్మకంగా మారుతుందని, దీంతో సమయం ఆదా కావడంతోపాటు ఇంధన వినియోగం కూడా తగ్గుతుందని పీజీయన్ వర్గాలు పేర్కొన్నాయి.

పోలీస్ అకాడమీలో గంటపాటు 'యోగా'

అకాడమీ డీజీ అభిలాషా బిస్ట్

సిటీబ్యూరో, జూన్ 19(నమస్తే తెలంగాణ): సమాజంలో అనేక నేరాలు సామాజిక రుగ్మతలకు మానసిక ఒత్తిడి కారణమనే విషయం అందరికీ తెలుసని, ఖైదీలకు యోగా శిక్షణ ద్వారా వారిలో సత్ప్రవర్తన మెరుగుపర్చవచ్చని రుజువైందని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ జనరల్ అభిలాషా బిస్ట్ అన్నారు. ఈనెల 21వ తేదీన 'అంతర్జాతీయ యోగా దినోత్సవం' సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జైళ్లు, కార్యాలయాల్లో ఖైదీలకు, సిబ్బందికి విడివిడిగా యోగా శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఇందుకు నాందిగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సహకారంతో పోలీస్ అకాడమీలో 1200 మంది పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు ఒక గంటపాటు యోగా సాధనకు శ్రీకారం చుట్టారని తెలిపారు.

నీట్ పేపర్ లీకేజీపై స్పందించరా?

కేంద్ర మంత్రులు సంజయ్, కిషన్‌రెడ్డిలను ప్రశ్నించిన విద్యార్థి సంఘాలు

లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

కవాడిగూడ, జూన్ 19 : దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పరీక్ష పేపర్ లీకేజీ స్కాంపై స్పందించేందుకు కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిల గొంతు మూగబోయిందా? అని విద్యార్థి సంఘాల నేతలు ప్రశ్నించారు. బుధవారం ఆమ్‌ఆద్మీ పార్టీ యువజన, విద్యార్థి సంఘాల పిలుపు మేరకు ఏవైడబ్ల్యూ, సీవైఎస్ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవైడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లంగి విజయ్, నాయకులు మాలోతు సురేశ్‌బాబు మాట్లాడారు. గత మూడేండ్లుగా వెలువడిన నీట్ పరీక్ష ఫలితాల్లో ఏ ఒక్కసారి కూడా ముగ్గురికి మించి మొదటి ర్యాంకు రాలేదన్నారు. అలాంటిది ఈసారి ఏకంగా 67 మందికి మొదటి ర్యాంకు రావడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. సుమారు 23 లక్షల మంది యువత భవిష్యత్‌ను నిర్ణయించే ఈ పరీక్షలో ఇంత పెద్దఎత్తున అవకతవకలు జరగడం బీజేపీ ప్రభుత్వ వైఫల్యమేనని పేర్కొన్నారు. దీనిపై ఎన్‌డీయే ప్రభుత్వం, ప్రధాని మోదీ తక్షణమే స్పందించి నీట్ పరీక్ష రద్దు చేసి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దర్శనం రమేశ్, కొడంగల్ శ్రీనివాస్, విశాల్, మానికన, కంచర్ల అక్షయ్, మహ్మద్ సోహల్, అహసాన్ పాల్గొన్నారు.

హిందూతత్వ వారసత్వాన్ని పరిరక్షించుకోవాలి

అందరికీ శ్రీహరే అంతరాత్మ పుస్తకాన్ని ఆవిష్కరించి.. మాట్లాడుతున్న రంగరాజన్

తెలుగు యూనివర్సిటీ, జూన్ 19 : విశిష్టమైన హిందూ తాత్విక వారసత్వాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్ పిలుపునిచ్చారు. బుధవారం అన్నమయ్య కళాక్షేత్రం, హిందూస్ ఫర్ ప్లూరలిటీ అండ్ ఈక్వాలిటీ సంయుక్తాధ్వర్యంలో అన్నమయ్య జయంతి సందర్భంగా ఆదర్శనగర్‌లోని బిఎంబిర్లా సైన్స్ సెంటర్ ప్రాంగణంలోని భాస్కర ఆడిటోరియంలో సమతా ఆధ్యాత్మికమూర్తి మహాసమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జైభారత్ పబ్లికేషన్స్ ప్రచురించిన 'అందరికీ శ్రీహరే అంతరాత్మ పుస్తకాన్ని' రంగరాజన్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారతీయ తాత్వికతలో విద్వేషం, అసహనం, అసమానత్వం, సంకుచితతత్వం వంటి లక్షణాలు లేవన్నారు. శాంతియుత సహజీవనమే హిందూతత్వం యోచనగా వివరించారు. ఈ సమ్మేళనంలో హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఈక్వాలిటీ సంస్థ జాతీయ అధ్యక్షుడు సాధు త్రినాథ దాస్, అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకస్వామి, విజయవిహారం రమణమూర్తి, పలువురు సాధువులు, ఆధ్యాత్మిక ప్రముఖులు పాల్గొన్నారు. శ్రీనివాస కళ్యాణం పౌరాణిక పద్యనాటకాన్ని సురభి కళాకారులు ప్రదర్శించి ఆహుతుల ప్రశంసలు అందుకున్నారు.

మన కల నిజం పుస్తకం ఆవిష్కరణ

సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వ్యాసాల సంపుటి 'మన కల నిజం' పుస్తకావిష్కరణలో పాల్గొన్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, జూన్ 19 : సమాజ అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతున్న నాగవరపు బల్‌రాం అరుదైన వ్యక్తులలో ఒకరని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రశంసించారు. సీఎస్ఆర్ విద్యా సంస్థలు నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో అబిడ్స్ తిలక్‌రోడ్డులోని తెలంగాణ సారస్వత పరిషత్తు హాలులో బుధవారం సాయంత్రం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వ్యాసాల సంపుటి 'మన కల నిజం' పుస్తకావిష్కరణ సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చింతపల్లి నిర్మలాదేవి–నారాయణరావుల పేరిట నెలకొల్పిన జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త నాగవరం బాల్‌రాంకు ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. తనను సాహిత్యం వైపు నడిపించిన వారిలో బలరాం ఒకరని కొనియాడారు. మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, దక్కన్‌ల్యాండ్ పత్రిక ఎడిటర్ ఎం. వేదకుమార్, సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, సాహితీవేత్తలు కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, చింతలపల్లి భాస్కరరావు, ప్రొఫెసర్ సీతారాం, వనపట్ల సుబ్బయ్య, కిషన్‌రావు, డాక్టర్ భూపేష్‌కుమార్, కొల్లాపురం విమల తదితరులు పాల్గొన్నారు.

కొత్త నేర చట్టాలు వెనక్కి తీసుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

సమావేశంలో మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య

ఖైరతాబాద్, జూన్ 19 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నేర చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. మహిళా, ట్రాన్స్‌జెండర్ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆంధ్రజ్యోతి, వీక్షణం ఎడిటర్లు కె. శ్రీనివాస్, వేణుగోపాల్, పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య, ఝాన్సీ, సామాజిక కార్యకర్త సజయతో కలిసి మాట్లాడారు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం కొత్త నేర చట్టాలను తీసుకువచ్చి ఎలాంటి చర్చకు అవకాశం లేకుండానే అమలు చేసిందన్నారు. భారతీయ న్యాయ సంహిత చట్టం, భారతీయ సురక్ష సంహిత చట్టం, భారతీయ సాక్ష్య అధినియం చట్టాలను తీసుకువచ్చిందన్నారు. ప్రస్తుతం కింది కోర్టు నుంచి సుప్రీం కోర్టు వరకు సుమారు 50లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి పరిష్కారం కావాలంటే రెండు మూడు దశాబ్దాలు పడుతుందన్నారు. కొత్త చట్టాలను పరిశీలిస్తే పౌరుల ప్రాణాలు, స్వేచ్ఛకు హాని కలిగించేలా ఉన్నాయని, భావ ప్రకటన స్వేచ్ఛ, పౌరులు గుమిగూడే స్వేచ్ఛ, సంఘటిత పడే స్వేచ్ఛ, నిరసనలు తెలుపడానికి ప్రదర్శనలు జరిపే స్వేచ్ఛలు ఇక నుంచి నేరాలుగా పరిగణించే అవకాశం ఉంటుందని ఆరోపించారు. ఈ చట్టాలను స్వతంత్ర న్యాయ నిపుణుల బృందంతో పునఃసమీక్షించాలని, పార్లమెంట్‌లో చర్చించి, ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉమెన్ అండ్ ట్రాన్స్‌జెండర్ జేఏసీ నాయకులు రచన, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌కు రెండ్రోజులు వర్ష సూచన

సిటీబ్యూరో, జూన్ 19(నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తన ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మరో పక్క నగరంలో మళ్లీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 33.1డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 26.3డిగ్రీలు, గాలిలో తేమ 50శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

విజయ డెయిరీ ఎదుట ఆందోళన చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు

విజయ డెయిరీ ఎదుట కార్మికుల ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 19: కార్మిక శాఖ అధికారి, కాంట్రాక్టర్‌లతో కుమ్మక్కై విజయ డెయిరీ అధికారులు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడంలేదని ఆరోపిస్తూ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు బుధవారం ఆరోపించారు. లాలాపేటలోని విజయ డెయిరీ కార్యాలయం ఎదుట తెలంగాణ మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత మూడేండ్లుగా ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడంలేదని, చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో వేతనాలు ఇవ్వడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కల్పించాలని కోరారు. దీనిపై డెయిరీ అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి తనకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కొరపాక అంజి, బాలరాజు, హమీద్‌ఖాన్, సాధిక్, హుస్సేన్, నయీమ్, సత్తి, కరుణ, బాలకృష్ణ, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వివేక్ వర్ధినికి 108 ఏండ్ల గొప్ప వారసత్వం

ఎన్‌సీఈఆర్‌టీ అడిషనల్ డైరెక్టర్ రమేశ్

వీవీఈఎస్ కన్యశాల పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎన్‌సీఈఆర్‌టీ అడిషనల్ డైరెక్టర్ జి.రమేశ్ తదితరులు

సుల్తాన్‌బజార్, జూన్ 19 : వివేక్ వర్ధిని ఎడ్యుకేషన్ సొసైటీ(వీవీఈఎస్)కి ఎంతో గొప్ప పేరు, ప్రఖ్యాతులు ఉన్నాయని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో గొప్ప స్థానాల్లో ఉన్నారని ఎన్‌సీఈఆర్‌టీ అడిషనల్ డైరెక్టర్ జి.రమేశ్ పేర్కొన్నారు. బుధవారం టెక్నిప్ ఎఫ్ఎంసీ సంస్థ ఆధ్వర్యంలో గౌలిగూడలోని వివేక్ వర్ధిని కన్యశాల ప్రైమరీ స్కూల్‌లో సామాజిక సేవలో భాగంగా తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన టెక్నిప్ ఎఫ్ఎంసీ ఎండీ అర్జున్ రుమాల, వివేక్ వర్ధిని ఎడ్యుకేషన్ సొసైటీ జాయింట్ సెక్రటరీ అనిల్ రాజేశ్వర్, వివేక్ వర్ధిని కన్యశాల ప్రైమరీ స్కూల్ చైర్మన్ కాంచన్ జట్కార్‌లతో కలిసి భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 108 ఏండ్ల గొప్ప వారసత్వాన్ని పూర్తి చేసుకున్న వివేక్ వర్ధిని కన్యశాల ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిందన్నారు. టెక్నిప్ ఎఫ్ఎంసీ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలలో తరగతి గదులను నిర్మించడం గొప్ప విషయమని, విద్యాశాఖ పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. టెక్నిప్ ఎఫ్ఎంసీ సంస్థ ఎండీ అర్జున్ రుమాల మాట్లాడుతూ.. వందేళ్లు పూర్తి చేసుకున్న పాఠశాలలో విద్యార్థుల విద్యాభ్యాసం కోసం తరగతి గదులను నిర్మించే అవకాశం వచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా 200 మంది విద్యార్థులకు స్కూల్స్ బ్యాగ్స్ అందజేశామన్నారు. టెక్నిప్ ఎఫ్ఎంసీ సంస్థ, హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా సంయుక్తాధ్వర్యంలో పాఠశాల తరగతి గదులు నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వివేక్ వర్ధిని కన్యశాల హెడ్ మాస్టర్ అశోక్ కరాట్, ప్రిన్సిపాల్ వైశాలి, టెక్నిప్ ఎఫ్ఎంసీ సంస్థ సీఎస్ఆర్ హెడ్ నిరంజన్ దేశాయ్, ఫైనాన్స్ హెడ్ నరేందర్‌కుమార్, హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా చీఫ్ మేనేజర్ జాన్ క్రిష్టఫర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో దుప్పి మృతి

శంషాబాద్ రూరల్, జూన్ 19 : వీధి కుక్కల దాడిలో ఓ దుప్పి మృతి చెందిన ఘటన బుధవారం శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పిల్లోనిగూడ వైపు నుంచి పాలమాకుల గ్రామం వైపునకు వీధి కుక్కలు ఓ దుప్పిని సుమారు రెండు కిలోమీటర్ల దూరం తరుముకుంటూ రావడంతో భయంతో దుప్పి మృతి చెందింది. స్థానికులు గమనించి వీధి కుక్కలను తరిమివేశారు. వెంటనే దుప్పి మృతి చెందిన విషయాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీ శాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని దుప్పిని మండలంలోని మల్కారం ఫారెస్టులో ఖననం చేస్తామని తీసుకెళ్లారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. వీధి కుక్కలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఏదో ఒకచోట ఇలాంటి దాడులు చేస్తున్నాయి. వీధి కుక్కల నివారణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అని కోరుతున్నారు.

బీపీఈడీ పరీక్ష ఫలితాలు విడుదల

హైదరాబాద్, ఆట ప్రతినిధి, జూన్ 19 : ఫిజికల్ ఎడ్యుకేషన్ బీపీఈడీ, డీపీఈడీ–2024 పరీక్ష ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కె.సురేంద్రమోహన్ విడుదల చేశారు. బుధవారం మాసబ్ ట్యాంక్‌లోని తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో వైస్ చాన్సలర్ కె.సురేంద్రమోహన్, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి మాట్లాడుతూ.. తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో 1705 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 1645 ఉత్తీర్ణత సాధించారని వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు ఎస్.మల్లేశ్, పాలమూరు యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఎల్‌బీ.లక్ష్మీకాంత్ రాథోడ్, శాతవాహన విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జె.ప్రభాకరరావు, ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్–2024 కన్వీనర్ ప్రొఫెసర్ రాజేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒమెగా హాస్పిటల్ విస్తరణకు రూ.500 కోట్లు

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): నగరంలో వైద్య సేవలందిస్తున్న ఒమెగా హాస్పిటల్స్ విస్తరణ కార్యకలాపాలకు మోర్గాన్ స్టాన్లె ప్రైవేట్ ఈక్విట్ ఏసియా భారీ మొత్తంలో పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించింది. తద్వారా నగరంతో పాటే దేశ వ్యాప్తంగా వైద్య సేవలందించేందుకు విస్తరణ పనులు చేపడుతుందని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మోహన్ వంశీ తెలిపారు. దేశంలోనే రెండో అతిపెద్ద క్యాన్సర్ వైద్య సేవలందిస్తున్న ఒమెగాలో అత్యాధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేసేందుకు ఈ నిధులు వెచ్చిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 10కి పైగా ఆస్పత్రులు, 1400లకు పైగా బెడ్లతో సర్జికల్ అంకాలజీ విభాగంలో వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీఈఓ డాక్టర్ నమ్రత, ఒమెగా హాస్పిటల్స్ అధ్యక్షుడు హరగోవింద్, మోర్గాన్ స్టాన్లె ప్రైవేట్ ఈక్విట్ ఏసియా మేనేజింగ్ డైరెక్టర్ అర్జున్ సైగల్ తదితరులు పాల్గొన్నారు.